www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 16 డిసెంబర్ 2023

తోట ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాల్లో జరిగిన ఆత్మీయ సమావేశం తోట నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జగన్‌ను గెలిపించడమే కాకుండా జగ్గంపేట నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధించాలన్నారు. నవరత్న పథకాలను అందజేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. పేద ప్రజలు, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిఎం జగన్ మాత్రమే అన్నారు. వైసిపిని తిరిగి మూడోసారి గెలిపించాలన్నారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో యువ నాయకులు తోట రాంజీ, తామరాడ సర్పంచ్ తోట అయ్యన్న, వైసీపీ నాయకులు ఏడుకొండలు, రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, తులా రాము పాల్గొన్నారు.

'తూర్పు'న సాబ్జీ అడుగుజాడ

- అనేక ప్రజా ఉద్యమాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం
- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం
- శాసన మండలిలో ప్రజాగళం వినిపించిన సాబ్జీ
- ఆయన మృతితో జిల్లాలో విషాదం

ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో ప్రతి కార్యకర్తనూ పేరుపేరునా పిలుస్తూ అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం ఆయనది. సమస్యల సాధనలో దూకుడైన శైలి ఆయన సొంతం. పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ప్రభుత్వం ఇచ్చే అనేక సౌకర్యాలను ఆయన త్యజించి సాధారణ పౌరునిగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పనిచేసిన నాయకుడు షేక్ సాబ్జీ. ఆయనకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో విడదీయరాని బంధం ఉంది. ఆయన మృతి జిల్లా వాసులను కలిచివేసింది. భౌతికంగా ఆయన దూరమైనా ఆయన వేసే ఉద్యమ అడుగుజాడలు జిల్లాలో చెరగని ముద్రలుగా నిలిచాయి.

ఎన్నికల ప్రచారంలో సాబ్జీ(ఫైల్)

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం, కాకినాడ ప్రతినిధులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ప్రజా ఉద్యమాల్లో ఎంఎల్‌సి సాబ్జీ తనదైన పాత్ర పోషించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపైనా కాకుండా కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపైనా, పేదలు, రైతులు, కౌలు రైతుల సమస్యలపైనా శాసనమండలిలో తన గళాన్ని వినిపించారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జరిగిన పోరాటాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. రాజమహేంద్రవరంలో కందుకూరి వారి ఆస్తులు ప్రభుత్వ పరం చేయాలని, అప్పటి శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, కెఎస్.లక్ష్మణరావులను కలుపుకొని ప్రజల భాగస్వామ్యంతో పోరాటాలు చేశారు. ఆ పోరాట ఫలితంగానే నేడు కందుకూరి విద్యా సంస్థలు ప్రభుత్వంలో విలీనం అయ్యాయి. అలాగే అధ్యాపకుల వేతనాల జిఒ విడుదల కోసం ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యా శాఖ మంత్రిని కలిసి విజయం సాధించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కోవిడ్ సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా ఉపాధ్యాయులకు వాక్సినేషన్ సెంటర్ల వద్ద డ్యూటీలు వేయడాన్ని వ్యతిరేకించారు. వారిని వెనక్కి తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. సిపిఎస్ రద్దు కోసం ఇచ్చాపురం నుంచి చేపట్టిన యాత్రలో బైక్‌పై మండుటెండలో ప్రయాణం చేసి స్ఫూర్తిగా నిలిచారు.

ఈ ఏడాది అగస్టులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్రలోనూ ఆయన భాగస్వాములయ్యారు. స్వయంగా సైకిల్ తొక్కి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థి సంఘం వెలుగులోకి తెచ్చిన అనేక సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించారు. కార్మికుల సమస్యలపై జరిగిన పోరాటాల్లోనూ భాగస్వాములయ్యారు. ఆయనకు ఎంతో ఇష్టమైన పిల్లల పండుగ బాలోత్సవం రాజమహేంద్రవరంలో నిర్వహించడానికి సాయశక్తుల కృషి చేశారు. గోదావరి బాలోత్సవం గౌరవాధ్యక్షులుగా వ్యవహరించారు. దీని విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ముగింపు సభలో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ చిన్నారులను ఉత్సాహపరిచారు. తాజాగా 2024 బాలోత్సవానికి కూడా ఆయన గౌరవాధ్యక్షులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ నెల 19న జరిగే బ్రోచర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొనేందుకు హాజరు కావల్సి ఉంది. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. ఆయన మృతి జిల్లా ఉద్యమాలకు తీరని లోటు అని జిల్లాలోని విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు.

2021 మార్చి 17న జరిగిన ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో సాబ్జీ విజయం సాధించారు. అనంతరం ఆయన కాకినాడ జెఎన్‌టియుకె కౌంటింగ్ కేంద్రం వద్ద విజయకేతనం చూపిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. కాకినాడ నగరమంతా జరిగిన మోటారు సైకిల్ ర్యాలీలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు.

బస్సయాత్రలో భాగంగా పిడిఎఫ్ ఎంఎల్‌సిలతో షేక్ సాబ్జీ (ఫైల్)

2022 జనవరి 29న పిఆర్‌సి సాధన సమితి ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల రాష్ట్ర స్థాయి రిలే దీక్షలు జరిగాయి. దీనికి ఆయన మద్దతుగా పాల్గొన్నారు. 11వ పిఆర్‌సిపై ప్రభుత్వం చేసిన జాప్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు.

2022 జూలై 25 నుంచి 31 వరకు పలాస నుంచి పెనుగొండ వరకూ జరిగిన 'బడి కోసం బస్సు యాత్ర' కాకినాడ వచ్చింది. ఈ యాత్రలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అందరూ పాల్గొన్నారు. ఇందులో సాబ్జీ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన ఉత్తేజ పూరితమైన ప్రసంగాలు చేశారు.

2022 నవంబర్ 29న కాకినాడ టీచర్స్ హోమ్‌లో జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా 5వ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. అలుపెరగని పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారు.

2023 నవంబర్ 12న కాకినాడ జెఎన్‌టియుకెలో జరిగిన జెవివి 17వ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రజల కోసం, సైన్స్ ప్రగతి కోసం సైన్స్, పర్యావరణం కోసం సైన్స్ నినాదాలతో పనిచేస్తున్న జెవివి ప్రజా సైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మరింత కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఎంఎల్‌సిగా గెలుపు అనంతరం విజయోత్సవ ర్యాలీలో సాబ్జీ(ఫైల్)

పలువురి సంతాపం

సిపిఎం

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ దుర్మరణం పట్ల సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఉపాధ్యాయ, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. పిడిఎఫ్ తరపున శాసనమండలిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల వాణిని వినిపించారని ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో యుటిఎఫ్ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారని. రాష్ట్ర అధ్యక్షులుగా చాలా కాలం పని చేశారని రాజశేఖర్ తెలిపారు. సాబ్జీ కుటుంబ సభ్యులకు సిపిఎం జిల్లా కమిటీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

యుటిఎఫ్

పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెవివి.నాగేశ్వరరావు, తోటకూర రవిచక్రవర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు ఆశ్రమ హాస్పిటల్‌లో ఉన్న సాబ్జీ పార్థివ దేహాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, సాయిరాం, జి.ప్రభాకరవర్మ, వివి.రమణ, కె.సత్తిరాజు, ఎన్.గోవిందరాజులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రమాదవశాత్తు మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.పిలిప్ రాజు, ఎన్.శ్రీనివాస్ అన్నారు. షేక్ సాబ్జీ హఠాన్మరణం పట్ల ఎపిటిఎఫ్ కాకినాడ జిల్లా శాఖ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. సాబ్జీ మృతితో ప్రజా ఉద్యమ గొంతుక మూగబోయిందన్నారు.

సిఐటియు

ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతి బాధాకరమని సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్ అన్నారు. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా టీచర్ల సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతగానో కృషి చేశారని, ఎంఎల్‌సిగా ఎన్నికైన తర్వాత ప్రజల్లో మమేకమై ప్రతి చిన్న విషయం పట్ల ఎంతో శ్రద్ధతో సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గ పోరాటాలకు తీరనిలోటని సంతాపాన్ని ప్రకటించారు.

తూరంగిలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

సమ్మెను పరిష్కరించాలని లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు ధర్నా చేశారు. రూరల్ మండలం తూరంగి పంచాయతీలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిపొందుతున్న లబ్ధిదారులు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ పట్టణ సిపిఎం కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లను, సేవలందిస్తున్న కార్యకర్తలు, ఆయాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఎటువంటి బేషిజాలకు పోకుండా సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం లబ్ధిదారులు సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు చింతపల్లి అజయ్ కుమార్, తటవర్తి సుబ్బారావు, పొట్నూరి జయప్రకాష్, జోగా అప్పారావు యుటిఫ్ విశ్రాంత నాయకులు పుప్పాల గోవిందరాజులు, జనసేన నాయకులు, లబ్ధిదారులు కక్కల సునీత, ఆకుల రజనీ, దువ్వి వెంకట దేవి, చింత అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

సెంటర్లు తెరవడంపై అంగన్‌వాడీల ఆగ్రహం

-సిఇఒ కార్యాలయం వద్ద ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం సిబ్బంది చేత అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇచ్చినమాట నిలబెట్టుకోలేని సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ జడ్‌పి సిఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి మాట్లాడుతూ సచివాలయం సిబ్బందికి జగన్ ప్రభుత్వం తాళాలు ఎలా పగలగొట్టాలో శిక్షణ ఇస్తూ అంగన్‌వాడీల సమ్మెను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించే సెంటర్లను సొంత ఇంటిలా భావించి విలువైన వస్తువులు సెంటర్లో పెడతారని, ప్రస్తుతం వాటికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. తప్పకుండా ఈ దుర్మార్గ చర్యలకు పాల్పడిన ప్రతి ఒక్కరి మీద న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్తు సిఇఒ ఎ.రమణారెడ్డి ధర్నా వద్దకు విచ్చేసి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మీ సమస్యలు పరిష్క రించే లాగా కృషి చేస్తానని తెలిపారు. అనం తరం ర్యాలీగా ధర్నా శిబిరానికి అంగన్‌వాడీలు చేరుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా అంగన్‌వాడాల సమ్మె శుక్రవారం నాటికి నాలుగో రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమస్యలు పరిష్కారం కోసం నినదించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడిచిపెట్టి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరుతుంటే సమ్మెను ఎలాగైనా విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉండడం శోచనీయమని పలువురు అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దిగి వచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. సచివాలయ సిబ్బందితో తాళాలు పగల కొట్టి కేంద్రాలను తెరిచినంత మాత్రాన సమ్మెను ఆప బోమని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీను నిలబెట్టు కోకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కటకం శెట్టి ప్రభాకర్, కాకినాడ రూరల్ టిడిపి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, వీరకుమార్, కె.అప్పారావు, జనసేన పార్టీ నాయకుడు పంతం నానాజీ మద్దతు పలికారు. ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ నరాల శివ, జిల్లా కార్యదర్శి కె.కృష్ణమోహన్, కాకినాడ సిటీ కన్వీనర్ వంగపండు కృష్ణమూర్తి, టిడిపి జనరల్ సెక్రెటరీ పెంకె శ్రీనివాస్ బాబు, సిఐటియు కోశాధికారి మలకా రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూరిబాబు, బి.ప్రభాత్ కుమర్, నాగబత్తుల వెంకట సుబ్బారావు, సిఐటియు నాయకులు మేడిశెట్టి రమణ మద్దతుగా మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. **పెద్దాపురం** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో జరుగుతున్న అంగన్ వాడీల సమ్మె శిబిరంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకురాలు బేబీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి చెక్కల రమణి పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి క్రాంతి కుమార్, అంగన్ వాడీ యూనియన్ నాయకులు నాగమణి, అమల, వరలక్ష్మి, ఫాతిమా, ఎస్తేరు రాణి, వనకుమారి, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ మండల కమిటీ కన్వీనర్ టేకుమూడీ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. నాలుగవ రోజు అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇది ఎంత మాత్రం సహేతుకం కాదన్నారు. వైసిపి నాయకులను, వాలంటీర్లను ఉపయోగించడం ప్రజాస్వామికం కాదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణవేణి, పద్మజ, ఆదిలక్ష్మి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో మండల నలుమూలల నుంచి వచ్చిన అంగన్‌వాడీలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, హనుమావతి, అన్నవరం మాట్లా డారు. మహిళా సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు మంగం పద్మ, వాసం శెట్టి పద్మ, సీతారామరాజు మద్దతు తెలిపారు. **జగ్గంపేట రూరల్** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు మండలంలోని తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐలకు వినతిపత్రాలు అందిం చారు. అంగన్‌వాడీల ఆందోళనకు డ్వాక్రా యానిమేటర్స్, జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ సంఘీభావం తెలిపారు. **పిఠాపురం** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన కొనసాగింది. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ, సిఐటియు నాయకులు కె.చిన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐ టియు నాయకులు కె.నాగేశ్వరరావు, కెవివి.సత్యనారాయణ, ఐద్వా నాయకులు కె మణి, వెంకటలక్ష్మి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎస్.వర్మ, జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ టి.ఉదయ శ్రీనివాసు మద్దతు తెలిపారు.

జడ్‌పి సిఇఒ కార్యాలయంలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పిఠాపురంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షురాలు పద్మ

పెద్దాపురంలో పొట్టి శ్రీరాముల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'

పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయం

ప్రజాశక్తి - యంత్రాంగం

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలు జిల్లాలోని పలు మండ లాల్లో శుక్రవారం జరిగింది. **కాకి నాడ** రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగనిరతి చిరస్మ రణీయమని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాకినాడ రామారావుపేట సిబిఎం స్కూల్-ఫెలోషిప్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ కృతికాశుక్లా, ఎంఎల్‌ఎ ద్వారం పూడి చంద్రశేఖరరెడ్డి, కూడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఆవాల రాజేశ్వరి, సుం కర శివప్రసన్న పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, బిసి కార్పొరేషన్ ఇడి బి.శ్రీనివాసరావు, బిసి సంక్షేమ అధికారిణి ఎన్.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి ఎ.విజయశాంతి, కాకినాడ అర్బన్ తహశీల్దార్ పివి.సీతాపతి రావు, గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పెద్ది రత్నాజీ పాల్గొన్నారు.

శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్

యు.కొత్తపల్లి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరా ములు వర్ధంతి కార్యక్రమం ఎంపిడిఒ పి.వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్లే రాష్ట్రం ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ పరి పాలనాధికారి సూర్యప్రకాష్, వైసిపి నాయకులు కారే శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు బుజ్జి, గుండ్ర రాజబాబు, పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన పొట్టి శ్రీరాములు మచ్చలేని ప్రజా సేవా తత్పరుడని వాకర్స్ జిల్లా కౌన్సిలర్ అడబాల రత్న ప్రసాద్ అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శ్రీరాములు వర్ధంతి జరిగింది. ఈ కార్యక్ర మంలో రాజా, సత్యనారాయణ పాల్గొన్నారు. **పెద్దాపురం** పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆర్‌డిఒ జె.సీతా రామా రావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర పాల్గొని నివాళులర్పించారు. **సామర్లకోట రూరల్‌లో** ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సత్తిబాబు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పాల్గొన్నారు.

నిరవధిక సమ్మె దిశగా ఆశాలు

ప్రజాశక్తి - కాకినాడ

తమ న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెనకాడేది లేదని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబిరాణి హెచ్చరించారు. ఆశా వర్కర్ల చేపట్టిన 36 గంటల ధర్నా కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన శుక్రవారం ధర్నా శిబిరాన్ని బేబిరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత పేరుతో జగన్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం మినహా మహిళలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కరోనా సమయంలో ఆశా కార్యకర్తల చేత గొడ్డు చాకిరీ చేయించుకుని వేతనాలు పెంచమనేసరికి జగన్ ప్రభుత్వం మొహం చాటేస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జనసేన రూరల్ నాయకులు పంతం నానాజీ, కాకినాడ అర్బన్ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆశాల శిబిరంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ విధానాల వలన అన్ని వర్గాల ప్రజలు, అన్ని సామాజిక తరగతుల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మారగానే ఆశాల సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రామిక మహిళల పట్ల జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుపట్టారు. ఆందోళన శిబిరానికి వైద్య ఆరోగ్యశాఖ డిఎంహెచ్ఓ శ్రీనివాస నాయకర్ విచ్చేసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్వీకరించారు. జిల్లాలో పరిష్కారం అయ్యే సమస్యలన్నింటిని పరిష్కారం చేస్తానని, మిగిలిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికై తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ శిబిరాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నరాల శివ, కృష్ణమోహన్, మేడిశెట్టి మోహన్, ఎన్‌జిఒ నేత బొజ్జా ఐశ్వర్య, ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, ఐద్వా జిల్లా నాయకురాలు జ్యోతి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రవతి, దళిత ఉద్యమ నాయకులు ఐయితాబత్తుల రామేశ్వరరావు మద్దతుగా మాట్లాడారు.

ఆశాల 36 గంటల ధర్నాలో మాట్లాడుతున్న గౌరవధ్యక్షురాలు బేబిరాణి

నేరాలు ఘోరాలు

చిన్నలంక కాలువలో రెండు మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రు చినలంక కాలువలో రెండు గుర్తు తెలియని మృతదేహాలను స్థానికులు గుర్తించారు. పలివెల నుండి ముక్కామల ప్రధాన పంట కాలువలో రెండు గుర్తుతెలియని మృతదేహాలను స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అంబాజీపేట పోలీసులు జేవిఎస్.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 35 సంవత్సరాల మహిళ, 13 సంవత్సరాల బాలిక గా గుర్తించి మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధం అయినట్లు ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం సహాయ అగ్నిమాపక అధికారి కె.మురళి కొండబాబు తెలిపారు. భాదితులు మరియు అగ్నిమాపక అధికారి తెలిపిన వివరాల ప్రకారం. .ముమ్మిడివరం నగర పంచాయతీ 4వ వార్డు సంత మార్కెట్ ఏరియాలోని మంద బయలు ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం మోర్త ఆదిలక్ష్మి భర్త ఆనంద రావుకు చెందిన తాటాకింటి నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్ని మాపక కేంద్రం ఇన్ ఛార్జ్ అధికారి కొండబాబు అద్వర్యం లో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు చుట్టు పక్కలకు వ్యాప్తి చెందకుండా అదుపుచేశారు.ఈ అగ్ని ప్రమాదంలో భాదితులు కట్టు బట్టలతో బయట పడ్డారని తెలిపారు. బాధితురాలు ఆదిలక్ష్మి కుమార్తె పెళ్ళి కోసం దాచిన రూ.1.50 లక్షలు, పెళ్లి దుస్తులు మరియు ఇంటికి సంబంధించిన దస్తా వేజులు కాలి బూడిదైనట్లు బోరున విలపిస్తున్నారు.

21 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్ఇబి సిబ్బంది పలుప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 21 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఇబి సిఐ పి.అశోక్ మాట్లాడుతూ అప్పన్నపాలెం గ్రామంలో ఆరు లీటర్ల సారతో ఒక మహిళను, రామచంద్రపురం గ్రామంలో 5 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని, సోమవారం గ్రామంలో ఐదు లీటర్ల సార్‌తో ఒక వ్యక్తిని, తామరాడు గ్రామంలో ఐదు లీటర్ల సారాతో మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డిటిఎఫ్ ఎస్ఐ జై విజయ్ కుమార్, సిబ్బంది కృష్ణార్జున, దొరబాబు, రాజు, వెంకటేశ్వర్రావు, వీరభద్రరావు, రామకష్ణ పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన శ్రీనివాస్

పవన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి - శంఖవరం

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌ను సాయిప్రియ సేవాసమితి కార్యకర్త, జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్ మర్యా దపూర్వకంగా కలిశారు. శుక్రవారం పిఠాపురం నియోజవర్గం పార్టీ ఇన్‌ఛార్జ్ తంగిళ్ళ ఉదయ్ శ్రీనివాస్‌తో వెళ్లిన జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్ మంగళగిరిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సాయి ప్రియ సేవా సమితి, జనసేన పార్టీ ఆధ్వ ర్యంలో నియోజకవర్గంలో చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను పవన్‌కు ఆయన వివ రించారు. పేద, మధ్యతరగతి ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేయా లని పవన్ సూచించినట్లు జ్యోతుల శ్రీనివాస్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పెద్దాపురం

స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ పరిధిలోని 9, 12, 19, 27 వార్డులలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి ల ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆయా వార్డుల పరిధిలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు నిర్వహించి చెత్తను, డ్రైనేజీల్లో పూడికను తొలగించినట్లు చెప్పారు.

'జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - తాళ్లరేవు

సిఎం జగన్మోహన్ రెడ్డి ద్వారానే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అన్నారు. గాడి మొగ పంచాయతీ సచివాలయం వన్ పరిధిలో వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇవిపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొని ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు కామాడి తాతారావు, మల్లాడి వర్మ, వైదాడి ధర్మారావు, కర్రి ఆదినారాయణమూర్తి, లంకే వీరబాబు, వైదాడి శ్రీనివాస్, బొమ్మిడి కోయరాజు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు మద్దతు ఇవ్వాలి : దవులూరి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సంక్షేమ రథసారథి సిఎం జగన్‌కి ప్రజల మద్దత ఎల్లప్పుడు ఇవ్వాలని రాష్ట్ర హౌసింగు కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో వైసిపికి ఘన విజయం చేకూర్చాలని కోరారు. తొలుత జెండాను ఆవిష్కరించి, అనంతరం గ్రామంలో సంక్షేమ పథకాలు పొందిన లబ్దిదారుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు.

యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్, కాకినాడ

యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలని పోలిట్ బ్యూరో సభ్యులు, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన రాజప్ప పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లోని యార్లగడ్డ సూర్యారావు రైతు భవనంలో టిడిపి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగు తున్న భవిష్యత్తు గ్యారెంటీ రిజిస్ట్రేషన్, ఓటర్ల జాబితా, యువగళం ముగింపు బహిరంగ సభ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అరాచక పాలనకు వ్యతిరేకంగా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు వైసిపి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వినతిపత్రాల ద్వారా తెలియపర్చారని చెప్పారు. ఈ నెల డిసెంబర్ 20న విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని పోలిపల్లిలో ముగింపు సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభలో చంద్రబాబు, పవన్ పాల్గొంటారని, నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, తోటకూర శ్రీనివాస్, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట, వెంకటకృష్ణరాయపురం గ్రామాలకు చెందిన గొల్లపల్లి సర్వేశ్వరరావు, కుర్రా నారాయణస్వామి ఆధ్వర్యంలో వైసిపి కన్వీనర్ వీరభద్ర కొండబాబు, వీరభత్తుల రాజు ఆధ్వర్యంలో 50 మంది యూత్ సభ్యులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి చినరాజప్ప టిడిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కాకినాడ అర్బన్ నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంఎంఎల్ వనమాడి కొండబాబు మాట్లాడారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలని, ఆ సభకు పెద్దఎత్తున ప్రజలను తరలించేలా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు తుమ్మల రమేష్, గదులు సాయిబాబా, చెక్కా శ్రీనివాస్, తాజుద్దీన్, ఒమ్మి బాలాజీ, తుమ్మల సునీత, మీసాల సునీత, దండుప్రోలు నాగబాబు, సికోటి అప్పలకొండ, సయ్యద్, మూర్తి, గాది శివ, బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహశీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ తుపాన్ కారణంతో తూర్పు గోదావరి జిల్లాలో వరి, మినప, మొక్క జొన్న, తదితర పంటలు మునిగి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తేమ శాతంతో పని లేకుండా ప్రతి గింజను ప్రభుత్వం కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సిఎస్ జిల్లా నాయకులు రమేష్, కుంచె అంజిబాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో అంగన్‌వాడీల ఫిర్యాదు

స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ అనుమతి లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలు బద్దలు కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక ఎస్ఐ వి.సురేష్‌కు ఫిర్యాదు చేశారు. సెంటర్లో రికార్డులు, సామాన్లు పోతే తమకు సంబంధం లేదని, అందుకు ఐసిడిఎస్ అధికారులే బాధ్యత వహించాల్సివుంటుందని చెప్పారు. తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సాబ్జీ మృతి అత్యంత విషాదకరం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతి అత్యంత విషాదకరమని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపి అంతలోనే అనంత లోకాలకు వెళ్ళిపోవడం విచారకరం అన్నారు. తన చివరి ఘడియల్లో సైతం ప్రజా ఉద్యమంలోనే ఆయన తుది శ్వాస విడిచారని అన్నారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని, ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యుకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నన్నయ్యలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సీనియర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రషర్స్ డే కార్యక్రమంతో క్యాంపస్ కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రశాంత మాట్లాడుతూ ఈ కళాశాలను ఎంపిక చేసుకునీ ఎంబిఎ విభాగంలో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్స్, జూనియర్స్ ఎప్పుడు కళాశాల ఔన్నత్యానికి పాటుపడాలని, అలాగే మీలో ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచడానికి అధ్యాపకుల సందేహాలను, సలహాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ హెచ్‌ఓడి డాక్టర్ అజయ్ రతన్, అధ్యాపకులు డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ అనిలాంబిక, డాక్టర్ కుమార్, మణికంఠేశ్వర్ రెడ్డి, మనోజ్ దేవ, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీదేవి, డాడాక్టర్ ఉమారజిత తదితర అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో వృత్తి విద్య శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ చేతి వృత్తులు ద్వారా వస్తువుల తయారీ, కళాత్మకత, నైపుణ్యతలపై పది రోజులపాటు నవోదయ విద్యాలయ విద్యార్థులకు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నవోదయ ప్రిన్సిపల్ ఆర్ కమలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవోదయలో చదువుకునే విద్యార్థులకు చదువుతోపాటు వివిధ వృత్తులు, వాటి నైపుణ్యతలు వంటి అంశాలపై కూడా అవగాహన పెంచేందుకు ఈ శిక్షణా శిబిరాలు దోహదపడతాయన్నారు. కర్ర చెక్కతో తయారు చేసే ఆట బొమ్మలు, పిల్లల బొమ్మలు తయారీలో ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాకకు చెందిన నిపుణుడు వరహాలు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొంటారన్నారు. ఆయన సాంప్రదాయక చెక్క బొమ్మల తయారీలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణా శిబిరం ప్రారంభ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య, ఎస్‌యుపిడబ్ల్యు టీచర్ ప్రేమలత, ఆర్ట్ టీచర్ వీరస్వామి మాట్లాడారు.

కెనాల్ రోడ్డు దుస్థితిపై జనసేన నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

నిత్య వేలాది మంది ప్రజలు, వాహనరాలు రాకపోకలు సాగిస్తున్న సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారి దుస్థితిపై జనసేన ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి(బాబు) ఆధ్వర్యంలో జనసైనికులు సామర్లకోట మండలం వికెరాయపురం గ్రామం నుంచి మాధవపట్నం వరకూ సుమారు 6 కిలోమీటర్లు నిరసన పాదయాత్ర నిర్వహించారు. రెండు టిప్పర్ లారీల మట్టిని దారిపోడవునా గోతుల్లో వేసి గోతులను పూడ్చి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకురాలు సుంకర కృష్ణవేణి, పెంకే వెంకటలక్ష్మి, సరోజా వాసు, నాయకులు పిట్టా జానకిరామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ స్కూల్ గేమ్స్‌కు భూపాలపట్నం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 12 నుంచి14 వరకు జరిగిన అండర్ 14, 17 విభాగాల్లో జరుగుతున్న నేషనల్ స్కూల్స్ గేమ్స్‌కు మండలం రాయ భూపాలపట్నం జడ్‌పి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి టి. సునంతబాబు ఉత్తమ ప్రతిభను చూపిటన్లు హెచ్‌ఎం జి.మల్లేశ్వరరావు తెలిపారు. తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు హేమర్ త్రోలో పాల్గొన్నారన్నారు. వీరిలో అనంత బాబు అండర్-17 బాయ్స్ హేమర్ త్రో విభాగంలోఎంపిక అయ్యాడని, 2024 ఫిబ్రవరిలో బీహార్‌లో జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటాడన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, కొండపల్లి, వడ్లమూరు, కాండ్రకోట, కట్టమూరు విద్యార్థులకు ఈ కామర్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్ వంటి అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి కాకినాడలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘం సెక్రటరి ఎం.భాస్కర్‌రావు, వి.శ్యామల, కె.సుధాకర్, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

వినతులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌సి, ఎస్‌టి వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న ప్రత్యేక స్పందన కార్యక్రమంలో అందిన వినతులను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాలులో ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఒ త్రినాథరావు, కలెక్టరేట్ ఎఒ జిఎస్ఎస్ శ్రీనివాసుల తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులకు పంపించి నిర్దిష్ట గడువులోగా పరిష్కారించాలన్నారు. భూ సమస్యలు, రెవె న్యూ సేవలు, ఉద్యోగ ఉపాధి అవ కాశాలు, పెన్షన్ తదితర అంశాలపై మొత్తం- 31 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసిమాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి వర్గాల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి నెల మూడో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్య క్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక స్పందనలో అందిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు.

ఓటరు నమోదు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ఓటరు నమోదు నిష్పక్షపాతంగా నిర్వహించాలని రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో బిఎల్‌ఒలతో ఓటరు నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతుఊ గ్రామంలో 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు చేయాలని అలాగే చనిపోయిన, వలస వెళ్లిన ఓటరులను తొలగించాలని ఆయన కోరారు. ఈ విషయంలో స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడికి గురికావద్దని ఆయన సూచించారు. బిఎల్‌ఒలు ఎటువంటి ప్రలోభాలకు లొంగిన వారే పూర్తి బాధ్యత వహించాల్సివుంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సత్యనారాయణ, డిటి సుబ్బారావు, ఆర్ఐ వేగేశ్వరరావు, విఆర్‌ఒలు ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, గోపాలరావు, సత్తిబాబు రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన మారెళ్ళ ఆనందరావు నిర్మించిన న్యూజియోన్ జీసస్ బాప్టిస్ట్ చర్చ్ 55 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆనందరావు మనవడు, మనవరాలు రెవరెండ్ డాక్టర్ మారెళ్ళ స్టీఫెన్ ఆనంద్, బిషప్ జాన్ థామస్ కుమార్తె టి.మేరి సుష్మ భర్త స్థానిక సంఘ కాపరి బిషప్ టి.దొరబాబు ఆధ్వర్యంలో విలియమ్స్ చారిటబుల్ సొసైటీ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. పవర ట్రీనిటీ హాస్పిటల్ డెరెక్టర్ ఆఫ్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు రిక్కీ గూటంలు ప్రారంభించారు. హైదరాబాద్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, పవర ట్రీనిటి హాస్పటల్ అఫ్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ వైద్యులచే రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్య సంస్థల అధినేత, వైసిపి మండల వైస్ ప్రశిడెంట్ కాకతీయ రాజు, గ్రామ ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు బిరుదా వీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పపంచ వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లెపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల న్యూ కాలనీలో మండల విద్యాశాఖ అధికారులు కెహెచ్.నాయక్, వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉప భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వెంకట రామన్ పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ నుంచి అందించే సదుపాయాలను వినియోగించుకుని వారి అభివృద్ధికి తల్లితండ్రులు తోడ్పడాలన్నారు. అలాగే మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఉపాధ్యాయులు, భవిత టీచర్స్ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. మల్లేపల్లి గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష నుంచి అందించే ప్రతి సౌకర్యాలను నియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్యాబులను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాలల హెచ్‌ఎం విఎస్.భాస్కరరావు, శ్యామలా కుమారి, లక్ష్మీదేవి, అబ్దుల్ బారి, సిఆర్‌పి లక్ష్మణరావు, సుభాషిణి, తాతాబాబు, తల్లీదండ్రులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ

నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక ఎపిఐఐసి కాలనీలో మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటి యువత ఆడంబరంగా జీవిస్తూ ధనాన్ని వృధా చేస్తుంటే, పేద మధ్యతరగతికి చెందిన దినసరి కార్మికులైన యువకులు తమ సంపాదనలో కొంత భాగాన్ని కేటాయించి ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు సమకూర్చడం అభినందనీయమని అన్నారు. గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవగా భావించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ సభ్యుల సేవా నిరతి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి నాగేశ్వరరావు, సందీప్, బాబి, స్వామి, వెంకీ, అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ పాఠశాలలో నేడు వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ పాఠశాలలో నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తామని ఎంఇఒలు ప్రభాకర్ శర్మ, వికె.చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలలకు బస్సు పాసులు ఇస్తారన్నారు.కావున సంబంధిత దరఖాస్తులు తెచ్చుకోవాలన్నారు

యానాం వార్తలు

రీజన్సీ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో యానాం రీజన్సీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రైమరీ లెవల్ విభాగంలో పొలిమారి సాత్విక్ ప్రదర్శించిన ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విత్ మిల్లెట్స్ అనే అంశానికి, అలాగే తోట కార్తికేయ ప్రదర్శించిన చంద్రయాన్-3 నమోనా అంశానికి బెస్ట్ సబ్ థీమ్ విభాగంలో బహుమతులు సాధించారు. ఈ అంశాలకు ఉషా రామలక్ష్మీ, పివి.వరలక్ష్ములు గైడ్ టీచర్లగా వ్యవహరించారు. చంద్ర యాన్-3 నమోనా ప్రదర్శించిన తోట కార్తికేయ తిరుపతిలో 2024 జనవరిలో నిర్వహించే సధరన్ లెవల్ సైన్స్ ఫేర్‌కు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్‌ఎంలు టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను, గైడ్ టీచర్లను ఆయనతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి

పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ

ప్రజాశక్తి - యానాం

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామ కృష్ణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రఘునాయగం, ఎస్ఐ నూకరాజు, కొల్లు ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్ఎఒ తనిఖీలు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

ప్రజాశక్తి - యానాం

స్థానిక మహాత్మా గాంధీ బాలుర పాఠశాల, రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని ఆర్ఎఒ మునిస్వామి శుక్రవారం ఆకస్మిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వండిన భోజన పదార్థాలను వాటి నాణ్యతను ఆర్ఎఒ మునిస్వామి స్వయంగా తిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పాఠశాల హెచ్‌ఎంలు ప్రతిరోజు పరిశీలించాలని సూచించారు. మెనూ ప్రకారం మంచి భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 4/2023
Between:
Savarapu Chanti
Savarapu Tataji ...Petitioners
AND
Chuttugulla Raja Ramesh and others ...Respondents
R-1: Chuttugulla Raja Ramesh, S/o. Yedukondalu, 87 years, R/o. D.No. 13, Maddulameraka, Kothapeta, Dr. B.R.Ambedkar Konaseema Dist., (Driver of APSRTC Bus No. AP 29 Z 1750)
పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 04-01-2024 సంగరం తేదీ ఉదయం 10.30 నిగలకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 14-12-23 ఎన్.వెంకటరాజు అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 5వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 80/2022
Between:
State Bank of India, R.A.S.M.E.C.C. & S.A.R.C., Danavaipeta, Rajahmundry, Rep. by its Manager, S.A.R.C. wing. ...Plaintiff
AND
Kadiyam Ram Kumar and Other ...Defendants
D-1: Kadiyam Ram Kumar, S/o. Satyanarayana, Hindu, aged 32 years, Business, D.No. 73-6-17, Narayanapuram, Opp. R.T.O. Office, Rajahmundry, E.G.Dist., Pin: 533105. ...1st Defendant
పై నెంబరు 1వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 28-12-2023 సంగరం తేదీ ఉదయం 10.30 నిగలకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 13-12-23 ఎం.గోపాలకృష్ణ అడ్వకేట్, రాజమండ్రి

జనరల్ నోటీసు ప్రకటన
మహారాజశ్రీ కాకినాడ ఫస్ట్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
I.P. No. 40/2023
పిటిషనరు: జక్కా వీర నాగ శివ శ్రీనివాస్
AND
రెస్పాండెంట్లు:
1. తాడి (కొవ్వూరి) మణికంఠ రెడ్డి, S/o. తెలీదు, వయస్సు 40 సంగలు, హిందూ, వ్యాపారం, సత్య గౌరీ థియేటర్ దగ్గరలో, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, సెల్:7989852322.
2. చిన్నం వీరభద్రారెడ్డి, S/o. వీర వెంకటరెడ్డి, వయస్సు 45 సంగలు, హిందూ, వ్యాపారం, వైఎస్ఆర్ విగ్రహం దగ్గరలో, కొంకుదురు గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా, సెల్: 9666699993.
3. పడాల సత్యనారాయణరెడ్డి, S/o. తెలీదు, వయస్సు 50 సంగలు, హిందూ, వ్యాపారం, రామాలయం ఎదురుగా, పందలపాక గ్రామం, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా, సెల్: 9849516289.
4. కర్రి సుబ్బారెడ్డి, S/o. శేషారెడ్డి, వయస్సు 45 సంగలు, శేషా మహల్ థియేటర్ ఎదురుగా, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మంలం, కాకినాడ జిల్లా, సెల్: 9177751115.
5. కర్రి శివరెడ్డి @ జ్యోలపతి, S/o. తెలీదు, వయస్సు 40 సంగలు, హిందూ, వ్యాపారం, ధ్వజ స్తంభం వీధి, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 998583399.
6. కొవ్వూరి హరిరెడ్డి, S/o. తెలీదు, వయస్సు 31 సంగలు, హిందూ, వ్యాపారం, లక్ష్మి నర్సాపురం పాటిమీద, జి.మామిడాద గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9652399993.
7. ఎరమాటి శ్రీనివాసు, S/o. కుసలయ్య, వయస్సు 40 సంగలు, హిందూ, వ్యాపారం, బొడ్డు భాస్కర రామారావు వీధి, పెద్దాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9052545657.
8. కలగా నరేంద్ర, S/o. సుబ్బారావు, వయస్సు 45 సంగలు, హిందూ, వ్యాపారం, బొడ్డు భాస్కరరావు కాలనీ, పెద్దాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9381322619.
9. పోలా రెడ్డి, S/o. తెలీదు, వయస్సు 40 సంగలు, హిందూ, వ్యాపారం, లక్ష్మి నర్సాపురం, పాటిమీద, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా, సెల్: 9714165555.
10. యార్లగడ్డ రాజబాబు, S/o. తెలీదు, వయస్సు 50 సంగలు, హిందూ, వ్యాపారం, పెద్దాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
11. మేడపాటి వెంకట సూర్యనారాయణరెడ్డి, S/o. మీరా రెడ్డి, వయస్సు 36 సంగలు, హిందూ, వ్యాపారం, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
12. మేడపాటి రామారెడ్డి, S/o. నారాయణరెడ్డి, వయస్సు 38 సంగలు, హిందూ, వ్యాపారం, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మంలం, కాకినాడ జిల్లా.
13. సత్తి బాబారెడ్డి, S/o. నారాయణరెడ్డి, వయస్సు 42 సంగలు, హిందూ, వ్యాపారం, జి.మామిడాడ గ్రామం, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.
14. అఫీషియల్ రిసీవర్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కాంపౌండ్, రాజమహేంద్రవరం.
పై నెంబరు పిటిషన్‌లో పిటిషనరు ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయించమనిన్ని, పిటిషనరు ఆస్తిని మేనేజ్ చేయుటకు అఫీషియల్ రిసీవర్ను నియమించుటకు వగైరా సంగతులతో పిటిషనరు ఇన్సాల్వెంట్ పిటిషన్ దాఖలు చేసినందున అందుకు ఆక్షేపణలు తెలియచేయుటకు పై కోర్టు వారి ఎదుట ది. 11-01-2024 తేది ఉదయం గం॥ 10.30 ని॥లకు ఆక్షేపణదారులు హాజరు అయ్యి మీరు మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియచేయడమైనది.
పిటిషనరు తరపున అడ్వకేట్
వందే విజయ రాజ్‌కుమార్
గణపతి నగర్, సామర్లకోట, కాకినాడ జిల్లా
సెల్: 8555051549, 9951063349